1

నవతెలంగాణ

ఆదిలాబాద్

బుధవారం | సెప్టెంబర్ 06, 2023 | www.navatelangana.com

బోథ్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.16వందల కోట్లు మంజూరు

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి కొరకు ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా రూ.16వందల కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. ప్రజల చిరకాల వాంఛగా మిగిలిన బజార్‌హత్నూర్, టెంబి, హార్కయి, ఇచ్చోడ, సొంపల్లి, సిరికొండ, గుడిహత్నూర్, శాంతపూర్, ఉమ్రి, రాంనగర్, నేరడిగొండ మండలంలోని కొరిటికల్, లింగట్ల, భీంపూర్ మండలంలోని ఏఐటీడీఏ రోడ్డు నుంచి బెల్సారిరాంపూర్, ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్, సిరికొండ, తాంసి మండలంలోని బండలనాగపూర్ నుంచి వడ్డాడి, భీంపూర్ మండలంలోని కరంజి, రాజులవాడి వరకు రోడ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భిక్షాటన చేస్తూ భగీరథ కార్మికుల నిరసన

నవతెలంగాణ-కెరమెరి

సమస్యలు పరిష్కరించాలని మిషన్ భగీరథ కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు మాట్లాడారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరి కాదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీమరాజు, బుడ్డయ్య, చరణ్, రాజు, ప్రేమ్, విఠల్ పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలుగుదేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు గాలిపెల్లి నాగన్న ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడిని మంగళవారం కలిశారు. పార్టీ తరపున ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకుంటున్న నేపథ్యంలో పార్టీ జాతీయ అధ్యక్షులతోపాటు రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, పొలిటిబ్యూరో సభ్యులు కంభంపాటి రామ్మోహన్‌రావు, అరవింద్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆర్థిక సంవత్సరంలో మరిన్ని వృత్తి విద్య శిక్షణ కోర్సులు



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో వృత్తి విద్య కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు నిర్వహించిన పరీక్ష కేంద్రాన్ని జీఎం డి రవిప్రసాద్ సందర్శించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని సంపాదన దిశగా ముందుకుసాగాలని మహిళలకు సూచించారు. యూనిట్‌గా ఏర్పడి వ్యాపారం ప్రారంభించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరిన్ని వృత్తి విద్య శిక్షణ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా మూడు వృత్తి శిక్షణ కోర్సుల్లో(టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్) శిక్షణ పొందిన మహిళలు పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎస్ చీఫ్ కోఆర్డినేటర్ శివకుమార్, కేజీఎంపీ అధికారి బానోత్ నరేష్, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, శిక్షకులు రూప, లక్ష్మీ, శ్రీదేవి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ వెంటనే ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి ప్రతిరోజు వందలాదిమంది ప్రజలు ఇతర ప్రాంతాల నుండి వస్తారన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న పాత మార్కెట్ స్థానంలో కొంతమంది బహిరంగ మలవిసర్జన చేయడంతో ఆయా ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బస్టాండ్ ప్రాంతంలో, జూబ్లీ మార్కెట్ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, గెడం టికనంద్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

రెబ్బెనలో నేడు జాబ్‌మేళా

నవతెలంగాణ - రెబ్బెన

రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రయివేటు కంపెనీ ఉద్యోగాలకు బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె రవికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ఎస్ ల్యాబ్స్, ఫ్లిప్కార్ట్‌లలో ఉద్యోగ ఖాళీల కోసం ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎంఎస్ఎస్ ల్యాబ్‌లో 55 శాతం మార్కులతో బైపీసీ లేదా ఎంపీసీ పూర్తిచేసి ఉండాలని, ఫ్లిప్కార్ట్‌లో డిగ్రీ పూర్తిచేసి ఉన్న నిరుద్యోగులు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన వారు జాబ్ మేళాకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు అన్ని రకాల ధృవీకరణ పత్రాలను తీసుకురావాలని పేర్కొన్నారు. జాబ్‌మేళా ఉదయం 10 గంటల నుండి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

6న బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ సబ్‌స్టేషన్‌లో సిటీ మార్చడం ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఉదయం 10నుండి మధ్యాహ్నం 12వరకు కైలాస్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు, శాంతినగర్, కుమ్మరివాడ, వికలాంగుల కాలనీ, ఎరో డ్రమ్ రోడ్, కైలాస్‌నగర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ - సిర్పూర్(టి)

మూడు రోజుల పాటు మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఇన్‌చార్జి తహసీల్దార్ లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో కొన్ని ప్రదేశాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచే అవకాశాలున్నాయన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు రోడ్లపై పడిపోవడంతో అవాంతరాలు ఏర్పడే అవకాశముందన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, అవసరముంటే పోలీస్‌స్టేషన్, రెవెన్యూ శాఖను సంప్రదించాలని ఆమె కోరారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సంతోష్ బేదొడ్కర్, మంచిర్యాల జిల్లాకు చెందిన అర్చన నూగురి.

ఆసిఫాబాద్‌లో భారీ వర్షం

- అడ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరికలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకున్నాయి. వాతావరణం పూర్తిగా చీకటి మయంగా మారడంతో పాటు భారీ వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలవడంతో పాటు ఒకేసారి భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో వరి పంట వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అడ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో అడ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. నెం.5, 6 గేట్లు 0.70 మీటర్ మేర ఎత్తి 2882 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా ఆదివారం ఉదయం నాటికి 237.300 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ఇప్పటివరకు 5.573 టీఎంసీలకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 2882 క్యూసెక్కులుగా ఉంది. దీంతో రెండు గేట్లు ఎత్తి 2882 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు కింద ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లాలో సోమవారం రాత్రి నుండి జిల్లా వ్యాప్తంగా వర్షం కురియగా మంగళవారం భారీ వర్షం కురిసింది. అధికారుల లెక్కల ప్రకారం సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు జిల్లాలో సగటు 18.6 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. జైనూర్‌లో 37మి.మీ, సిర్పూర్(యు)లో 36.2, లింగాపూర్‌లో 56.4, తిర్యానిలో 2.4, రెబ్బెనలో 4.2, ఆసిఫాబాద్‌లో 4.2, కెరమెరిలో 35.6, వాంకిడిలో 2.6, కాగజ్‌నగర్‌లో 5.4, సిర్పూర్(టి)లో 23.6, కౌటాలలో 9.6, చింతలమానేపెల్లిలో 13.2, బెజ్జూర్‌లో 21.6, పెంచికల్‌పేటలో 14.2, దహేగాంలో 12.4 మి.మీటర్ల వర్షపాతం కురిసింది.

వర్ష సూచనతో కలెక్టర్ హెచ్చరికలు జారీ

జిల్లాలో రానున్న రెండు రోజులపాటు భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ జిల్లా ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసరమై సహాయం అవసరమైన వారు 6304686505 కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

ఆర్టీసీ సేవలు ఉపయోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ శ్యామలదేవి
- రాఖీ పండుగ లక్కీడ్రా విజేత ప్రకటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రైవేటు వాహనాలు ద్వారా ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అదే ఆర్టీసీలో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చని అడిషనల్ కలెక్టర్ కె.శ్యామలదేవి అన్నారు. రాఖీ పండుగ లక్కీ డ్రా ప్రక్రియను మంగళవారం ఆర్టీసీ డిపోలో నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డ్రా తీసి గెలుపొందిన వారిని ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్టీసి అద్భుతమైన పథకాలను అమలు చేస్తోందన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక బహుమతులను అందజేయడం హర్షణీయమన్నారు. దీని ద్వారా ఆర్టీసీ సేవలు మరింతగా విస్తృతమవుతాయన్నారు. లక్కీ డ్రా విజేతలకు అభినందనలు తెలియజేశారు. లక్కీ డ్రా లో మొదటి బహుమతి ఎస్ లక్ష్మి రూ.25వేలు, రెండో బహుమతి కె ప్రాంజల్ రూ.15000, మూడవ బహుమతి ఆధ్యశ్రీ రూ.10వేలు గెలుపొందారు. ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రయాణికులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే రాఖీ పండుగను పురస్కరించుకుని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. విజేతలకు ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్, సురేష్ చౌహాన్, అకౌంట్ ఆఫీసర్ పుల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ జిబ్ల, ఆర్ఎం ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ కిరణ్, డిపో అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.




ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఆసిఫాబాద్ : జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయుల అవతారం ఎత్తి విద్య బోధన చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పలుచోట్ల సన్మానాలు చేశారు. లయన్స్ క్లబ్ ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ వేడుకల్లో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్‌తో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ నాంపల్లి శంకర్, అధ్యక్షుడు ఉబెద్ బిన్ యహియా (తారిక్), అదిల్ పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఉపాధ్యాయులు కొమురయ్య, నారయ్యను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కర్ణగౌడ్, నాయకులు సదానందం, శంకర్, మధుసూదన్, లింగయ్య, గౌరక్క, పుల్లయ్య పాల్గొన్నారు.

కౌటాల : సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని గుండాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన గురించి విద్యార్థులకు వివరించారు.





వాంకిడి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పాఠశాలల్లో టీచర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీచర్స్ డేను పురస్కరించుకొని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ సంపత్‌కుమార్ బహుమతులను అందజేశారు.

రెబ్బెన : మన్నెగూడెం పాఠశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బత్తుల సదానందం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి : ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తాంసి, భీంపూర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్, జ్యోతిబాపూలే చిత్ర పటాలకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పారు.

సిర్పూర్(టి) : మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు కనబరిచిన ప్రతిభను గుర్తించి బహుమతులు ప్రదానం చేశారు.

రెండో రోజుకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం రెండవ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం పిఆర్సి ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరందరికీ వారి క్యాడర్ ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖలోని పర్మినెంట్ ఉద్యోగుల బేసిక్ అలవెన్సులు నిర్ణయించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న సుమారు 17వేల మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జీఓ అమలు కాని కేడర్లకు కూడా బేసిక్, డిఎ, హెచ్‌ఆర్‌ఎ కలిపి గ్రాస్ శాలరీ నిర్ణయించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు హెచ్‌ఐఆర్ పాలసీని రూపొందించాలన్నారు. మెడికల్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సమ్మెకు బీజేపీ మద్దతు

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి మద్దతు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 510 జీఓ అమలు కాని కేడర్లకు కూడా బేసిక్, డీఎ, హెచ్‌ఆర్‌ఎ, గ్రాస్ శాలరీని నిర్ణయించాలన్నారు. ఆమె వెంట నాయకులు కొత్తపెల్లి సంతోష్, తాటి సతీష్, సబ్ధార్, ప్రశాంత్, హరికృష్ణ, ఆనంద్ ఉన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గృహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహలక్ష్మి, దళితబంధు, హరితహారం తదితర అంశాలపై ఎంపీడీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర పరిశీలనలో అందించిన గృహలక్ష్మి దరఖాస్తుదారుల ఆహార భద్రత, ఆధార్, పట్టా వంటి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని అన్నారు. గ్రామాలవారిగా ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలతో ఇల్లు కోల్పోయిన వారి వివరాలను సేకరించాలని తెలిపారు. దళితబంధు రెండవ విడత దరఖాస్తులను పరిశీలించి డిమాండ్ ఉన్న పౌల్ట్రీ, డెయిరీ వంటి యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలని, వాటిపై లబ్దిదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. 9వ విడత హరితహారంలో భాగంగా జిల్లాలో లక్ష్యం మేరకు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. జిఓ నెంబర్ 58, 59 దరఖాస్తులను పరిశీలనను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్త, జడ్పీ సీఈఓ గణపతి, గృహ నిర్మాణ నోడల్ అధికారి బసవేశ్వర్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

మున్సిపల్ సమ్మెకు ఎంఐఎం మద్దతు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మున్సిపల్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె రెండవ రోజూ కొనసాగింది. మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని మంగళవారం ఎంఐఎం పట్టణ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఐఎం పట్టణాధ్యక్షుడు అబ్దుల్ ముబీన్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సొసైటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జెఏసీ పిలుపు మేరకు ఈ శాంతియుత సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. తమ సిబ్బంది విధులు చేపడుతూనే ఈ సమ్మెలో పాల్గొంటారని వివరించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జేఏసీ నిర్ణయం మేరకు ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ కార్యదర్శి జావిద్, సయ్యద్ సాదిక్, ఎస్‌కే అస్గర్, ఎండీ అఫ్జల్, అమర్, అహ్మద్ పాషా, వాజిద్‌ఖాన్, అబ్దుల్ సయీం, మున్సిపల్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

అకాడమిక్ కౌన్సెలర్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాగజ్‌నగర్ అధ్యయన కేంద్రంలో అకాడమిక్ కౌన్సెలర్స్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం, బీసీ, ఓసీ అభ్యర్థులు 55 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టులకు ఓపెన్ యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ హార్డ్ కాపీని ఈ నెల 10 లోపు కాగజ్‌నగర్ అధ్యయన కేంద్రంలో అందజేయాలని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | సెప్టెంబర్ 06, 2023 | www.navatelangana.com

వరినాట్లు వేసిన యువత

నవతెలంగాణ-సిరికొండ



రైతులు ఆరుగాలం కష్టపడి పండిస్తేనే తినడానికి దొరికేదని భావించి, రిమ్మ గ్రామంలోని యువత మంగళవారం వరి నాట్లు వేశారు. గ్రామంలోని దాదాపు 82 మంది యువకులు అందరూ కలిసి గ్రామంలోని పంట పొలాల్లో వరినాట్లు వేసి అబ్బురపరిశారు. నేటి కంప్యూటర్ యుగంలో జల్సాలకు అలవాటు పడి, కొందరు యువకులు తమ విలువైన సమయాన్ని వృదా చేస్తున్న తరుణంలో, రైతులకు అండగా నిలవాలని భావించి కొంత చేదోడుగా యువకులు నిలిచారని సర్పంచ్ అనిల్ కుమార్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన భగత్ రాంజీకి ఎంపీపీ గంద్రత్ రమేష్ మంగళవారం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.10వేల 500ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ రాంచందర్, వైస్ ప్రెసిడెంట్ కుమ్ర జంగు, బీసీ సెల్ ప్రెసిడెంట్ అంచెట్టి నాగన్న, రైతు విభాగం వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్స్ యజమానుల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-కుభీర్

ట్రాక్టర్స్ యజమానుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండలంలోని పార్డి(బి) గ్రామంలో శ్రీరాజరాజేశ్వర మందిరంలో గ్రామస్తుల, రైతుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో ట్రాక్టర్ యజమానుల యూనియన్ అధ్యక్షుడిగా ఎంజాల్‌వార్ గణేష్, ఉపాధ్యక్షుడిగా ఠాకూర్ గులాబ్‌సింగ్, క్యాషియర్‌గా అన్వర్ ఖాన్, కార్యదర్శిగా రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మిగితా 25 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్టు అధ్యక్షుడు గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులకు ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారుడు లింగిశెట్టి రాజు, పోతాం ప్రసాద్, సంజు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడుగా సతీష్‌రెడ్డి

నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా కడెం మండలానికి చెందిన పొద్దుటూరి సతీష్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డి నియమించారు. నియామక పత్రాన్ని గాంధీ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావుతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి, సతీష్‌రెడ్డికి మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా యూత్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నందుకు గాను తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత ఇచ్చినందుకు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించినందుకు గాను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డికి మాజీ ఎమ్మెల్సీ ఎన్నికల కమిటీ సభ్యులు ప్రేమ్ సాగర్‌రావుకి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రావణ్‌రావు అమీర్ జావీద్, జిల్లా ఇన్‌చార్జి ఇసాక్, ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల దృష్ట్యా పరస్పర సహకారం అవసరం

నవతెలంగాణ-సారంగాపూర్

తెలంగాణలో రాబోయే రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరిహద్దు మహారాష్ట్ర పోలీసులు పరస్పర సహకారం అందించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సరిహద్దులోని నాందేడ్ జిల్లా ఇస్లాపూర్ పోలీస్ స్టేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించడం కోసం సమావేశం నిర్వహించామని తెలిపారు. ఎన్నికల సమయంలో జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలో మద్యం, నగదు సరఫరా నియంత్రణకు మహారాష్ట్ర పోలీసుల సహకారంపై చర్చించామని అన్నారు. జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలా నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఇస్లాపూర్ ఇన్స్‌పెక్టర్ ఉమేష్ భోసలే, ఎస్సైలు కామదే, సారంగాపూర్ ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్(జి) మండలంలోని నసీరాబాద్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నసీరాబాద్ గ్రామానికి చెందిన మల్లెల గంగాధర్(37) తనకున్న ఒక ఎకరంతో పాటు నాలుగు ఎకరాల్లో మొక్క జొన్న కోసం రూ.3లక్షలు అప్పు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రోజు దిగులు పడేవాడు. ప్రతిరోజులాగే సోమవారం తెల్లవారు జామున పొలానికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆరా తీయడంతో పురుగులమందు తాగినట్టు తెలిపాడు. నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. భార్య మల్లెల సత్తేవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన మేరు సంఘం నాయకులు

నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామంలో నిర్వహించిన మేరు సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండల మేరు సంఘం నాయకులు తరలివెళ్లారు. అక్కడ జరిగిన కార్యక్రమానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. మంత్రితో పాటు నూతన కమిటీని మేరు సంఘం నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాపర్తి లక్ష్మణ్, రాపర్తి వెంకటేష్, సలహాదారులు దీకొండ రాము, రాపర్తి సతీష్, రాపర్తి గంగ నర్సయ్య, గట్ల రాజేష్ పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న బ్రమ్మేశ్వర్ జలపాతం



నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కుభీర్ మండలంలోని బ్రమ్మేశ్వర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జలపాతం ఇక్కడ చాలా పురాతనమైన శివాలయం ఉంది. దీంతో ప్రతి ఏడాది శ్రావణ మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుంటారు. అదేవిధంగా శ్రావణ మాసంలో ప్రతి శనివారం, సోమవారం శివాలయానికి భక్తుల తాకిడి పెరుగుతుంది. శివాలయానికి పక్కనే ఉన్న జలపాతం చుట్టూ గుట్టలు అటవీ మధ్య లోయలో ఉన్న బ్రమ్మేశ్వర జలపాతం సందర్శకులను కనువిందు చేస్తుంది. దీంతో అక్కడికి వచ్చే భక్తులు పుణ్య స్థానాలు చేసి శివుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. అదేవిధంగా అక్కడ పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

అన్నివర్గాల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కనకపూర్ గ్రామంలో జిల్లా మేరు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారనికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నూతన కార్యవర్గనికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. నిర్మల్ జిల్లా ఏర్పాటు తరువాత జిల్లా అభివృద్ధిలో అన్ని రంగాల్లో దూసుకుపోతుందని తెలిపారు. మేరు కులవృత్తిలో ఎన్నో ఏండ్లుగా కష్టపడుతున్న వారికి సముచిత స్థానం కల్పించడంతో పాటు, సాంకేతికతను జోడించి మేరు కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతీ వర్గం లబ్ది పొందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మేరు సంఘం జిల్లా అధ్యక్షులు పూసపత్రి సత్యనారాయణ, మాజీ డీసీసీబీ చైర్మెన్ రాంకిషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేశం లక్ష్మి రమేష్, స్థానిక సర్పంచ్ సుక్కు రాజవ్వ ముత్తన్న, మాజీ సర్పంచ్ రాజేందర్ యాదవ్, మండల మేరు సంఘ అధ్యక్షులు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల కన్వీనర్ సురేందర్‌రెడ్డి, మేరు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

- డీఎస్పీ గంగారెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, నేరాలను కట్టడి చేయవచ్చని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన వీధులు, చౌరస్తాల్లో సర్పంచ్ సుజాత, నర్సారెడ్డి ఆధ్వర్యంలో సొంత ఖర్చు రూ.1.30లక్షలతో పాత 16 సీసీ కెమెరాలను రిపేర్, 4 కెమెరాలు నూతనంగా ఏర్పాటు చేయగా డీఎస్పీ వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డితో పాటు మరమ్మతులు రూ.10వేలు ఇచ్చిన మండాజి అరుణ్‌లను శాలువాతో సన్మానించారు. అదేవిధంగా మలక్ చించోలి గ్రామాల్లో వీడీసీ ఆధ్వర్యంలో 15సీసీ కెమెరాలు ప్రారంబించారు. అనంతరం మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగా ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరించిన గ్రామ సర్పంచ్, వీడీసీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజ్ మహమ్మద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిషేధిత గుడుంబా తాగడంతో కలిగే అనర్థాలపై అవగాహన



నవతెలంగాణ-కడెం

ఎక్సైజ్ స్టేషన్ నిర్మల్ పరిధిలోని కడెం మండలానికి చెందిన పెద్దూర్ తండాలో మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని, ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో తండాకు చెందిన ఇస్లావత్ మేనాబాయి వద్ద నిషేధిత గుడుంబా సుమారు ఐదు లీటర్లు లభించగా స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. అనంతరం తండాలోని యువకులు, మహిళలు, తండా వాసులకు అవగాహన సదస్సు నిర్వహించి, నిషేధిత గుడుంబా తాగడం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఎక్సైజ్ చట్టరీత్య నిషేధిత గుడుంబా తయారు చేయడం, అమ్మడం, రవాణా చేయడం లేదా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలైన బెల్లం, పటిక కలిగి ఉండటం నేరమని తెలియజేశారు. ఎవరైన చట్టానికి విరుద్ధంగా ఇట్టి కార్యకలాపాలకు పాల్పడినచో ఈ నెంబర్ 9440902714 కు సమాచారం తెలియజేసి సహకరించాలని కోరారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం నింధితురాలైన ఇస్లావత్ మేనాబాయిని మరలా ఇలాంటి నేరం చేయకుండా సత్ప్రవర్తన కలిగి ఉండేందుకుగాను స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ తనిఖీల్లో నిర్మల్ స్టేషన్ ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్, పోలీస్ ఏఎస్సై భీంరావు, పోలీస్ కానిస్టేబుళ్ల, ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, వెంకటేష్, భాస్కర్, నిరోష పాల్గొన్నారు.

గొర్ల పంపిణీ వెంటనే చేపట్టాలి



నవతెలంగాణ-తాంసి

గొల్లకుర్మలకు పంపిణీ చేసే సబ్సిడీ గొర్లను వెంటనే పంపిణీ చేయాలని గొల్లకుర్మల జిల్లా అధ్యక్షులు గొడం గణేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గొల్లకుర్మల సంఘం సభ్యులతో కలిసి సమావేశం ఎర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షాధికారి చేస్తానని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన సీఎం గొర్ల పంపిణీ పథకం ప్రవేశపెట్టి ఏండ్లు గడుస్తున్న గొర్ల పథకం పూర్తి కాలేదని అన్నారు. రాష్ట్రంలో జనాభా ప్రతిపాదికన చూస్తే రూ.3లక్షల కోట్ల, బడ్జెట్‌లో సంవత్సరానికి రూ.203 వేల కోట్ల యాదవులదే సంపాదనని అన్నారు. యాదవులకు రూ 3వేల కోట్లు ఖర్చు చేయడానికి మనసు రావడం లేదని అన్నారు. ప్రజలందరి దృష్టిలో యాదవులకే ఖజానా పెడుతున్నట్టు మాట్లాడుతున్నారని అన్నారు. మునుగోడు ఉపఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు గొల్లకురుమల ఓట్ల కోసం గొర్ల పథకానికి తీరలేపి ప్రతి లబ్దిదారుడు వాటా రూ.43వేల 750 చెల్లించడానికి 15 రోజులు గొర్ల పంపిణీ లేదా నగదు బదులు అని నమ్మించి రాష్ట్ర వ్యాప్తంగా గొల్లకురుమల నుంచి రూ.2వేల కోట్లు లబ్దిదారులని వాట కింద వసూలు చేసిన మునుగోడులో డబ్బులు వాడుకున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో గొర్లు పంపిణీ చేసి యాదవుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో యాదవులతో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కసవెని నారాయణ, తాంసి మండల యాదవ అధ్యక్షుడు రాకేష్ యాదవ్, సంఘం సభ్యులు రామన్న యాదవ్, నవీన్, రాము, ఉశన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఆ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు భరత్ వాగ్మరే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దోపిడీ వ్యవస్థ పెరిగిందని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎన్నికైన ప్రజాప్రతినిదులు ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధుల్లో నుంచి కమిషన్‌ను దండుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబం వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, వారు లేకుంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేది కాదని కొందరు నాయకులు ప్రకటనలు చేస్తుంటే సభ్య సమాజం నివ్వెరపోతోందని అన్నారు. నిజమైన ఉద్యమకారులను అవమానిస్తున్నారని అన్నారు. ఉద్యమకారులంతా ఈనెల 12న ఇచ్చోడ మండలంలోని గంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఉద్యమకారులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం రాజేశ్వర్, లక్ష్మి నారాయణ, నారాయణ్ రెడ్డి, గద్దల శంకర్ పాల్గొన్నారు.



ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంతో పాటు పార్డి(బి) పల్సి, సొనారి, మలేగాం గ్రామాలతో పాటు అన్ని గ్రామాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు కళాశాలలో ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ చంద్రకాంత్ హజరై మాట్లాడారు. ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని ఆయన అడుగుజాడల్లో నడువాలని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు, ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు.



తలమడుగు : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికైన మండలంలోని ఖోడద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకన్నకు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గణిత స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ యోగ మాస్టర్‌గా సేవలందిస్తున్న వెంకన్న పాఠశాల సిబ్బంది గ్రామస్తులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో జరిగిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయుల వేషాధారణలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చక్కగా విద్యార్థులు పాఠాలు బోధించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉపాధ్యాయుడు డి.వెంకన్నని శాలువా, బొకేలతో పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను విద్యార్థులు, ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మి, సుకుమార్ పెట్కులే, సురేఖ, ఎం.వాసుదేవ్, ఎస్. సురేఖ, మమత, కిరణ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకల సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి.భరద్వాజ్ భారతదేశానికి రెండో రాష్ట్రపతిగా పనిచేసిన రాజకీయవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విభాగాల అధిపతులు రాజ్ కుమార్, క్రాంతి కుమార్, రవికుమార్, సుజయ్, సురేష్, అధ్యాపకులు విజయలక్ష్మి, శ్రీనివాస్, ప్రవీణ్, రామేశ్వర్‌రెడ్డి, నీల్‌కమల్, సురేష్, యశశ్రీ, జ్యోత్స్న రాణి, హేమలత, సంగీత, సుధాకర్, గజానంద్‌రావు, మురళి కృష్ణ, కుమారస్వామి, సంజయ్ సింగ్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణాలకు తెగించి.. విద్యుత్ సరఫరా అందించి..

నవతెలంగాణ-కడెం

మండలంలోని పెద్ద బెల్లాల్ చెరువులో ప్రాణాలకు తెగించి నీటిలో ఈదుతూ జూనియర్ లైన్‌మెన్ నర్సయ్య మంగళవారం విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహించి, పెద్ద బెల్లాల్, చిన్న బెల్లాల్, చిట్యాల గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించారు. ఈ మరమ్మత్తుల పనులు నిర్వహించిన వారిలో లైన్‌మెన్ సంతోష్, లైన్ ఇన్స్‌పెక్టర్ రాములు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎఫ్‌బీఓలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని కొత్త మద్ది పడగ గ్రామంలో మైసంపేట్, రాంపూర్ గ్రామాల వారికి నిర్మిస్తున్నటువంటి పునరవాస కేంద్రాలను మంగళవారం ఎఫ్ఆర్ఓ అనిత ఆధ్వర్యంలో అటవీశాఖకు చెందిన దుల్లపల్లి అకాడమీ చెందిన 34 బీట్ ఆఫీసర్స్ సందర్శించారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా..

నవతెలంగాణ-ఉట్నూర్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి, గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గోదారిగూడలో పర్యటించారు. గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గంతో పాటు అన్ని మండలాలను గ్రామాలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యకర్తలు సమిష్టి కృషితో పని చేయాలని అన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకుని పోవాలని కోరారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, నాయకులు అనుదీప్, సన్నీ, రవికుమార్, రాజేశ్వర్ గ్రామస్తులు ఉన్నారు.

పల్లకి ఊరేగింపుతో ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యాశాఖ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన 8వ రోజుకు చేరుకుంది. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, జ్యోతిభాపులే, సావిత్రిబాయి చిత్రపటాలతో పల్లకి ఊరేగింపు, రథయాత్ర నిర్వహించి నిరసన తెలిపారు. సమ్మె శిబిరం నుంచి ప్రారంభమైన పల్లకి రథ యాత్ర కలెక్టర్ చౌక్ మీదుగా ఎన్టీఆర్ చౌక్‌కు చేరుకుంది. అనంతరం ఆచార్య జయ శంకర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. కొద్దిసేపు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే త్వరలో 11 నుంచి శాశ్వతంగా సమ్మె చేపట్టనున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాధవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా కోశాధికారి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, వెంకటి, ప్రకాష్, ధరంసింగ్, పార్థసారథి, సురేష్, రాకేష్, రమేష్, రాజన్న, నాయకులు ఉన్నారు.

యువతకు ఉపాధినివ్వని ప్రభుత్వాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి యువతను మోసం చేస్తోందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఉయిక విష్ణు అన్నారు. మంగళవారం యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ధరలను నియంత్రించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువులు రోజు రోజుకు పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్‌గా మారుస్తున్నారని విమర్శించారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు దొరకక నిరుద్యోగులుగానే మిగిలి పోతున్నారని, ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదని వెల్లడించారు. ఉపాధిహామీ పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం దీనితో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోరావు, యశ్వంత్ పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు

నవతెలంగాణ-తాండూర్



2022-23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా వృత్తి శిక్షణ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు మాదారంలోని కమ్యూనిటీ హాల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. 4 కోర్సుల్లో (మగ్గం, ఫాషన్ డిజైనింగ్ -2, టైలరింగ్) శిక్షణ పొందిన మహిళలకు ఎస్ఎస్ఎస్ చీఫ్ కోఆర్డినేటర్ డీఎస్ శివకుమార్, కేజీ ఎంవీ అధికారి బానోత్ నరేష్‌లు పరీక్షలు నిర్వహించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న కోర్సుల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు ఝాన్సీ, సౌజన్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక 5వ వార్డు అమరవాదికి చెందిన సౌజన్య, వెంకటేశం, అలేఖ్యలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ క్యాతనపల్లిలోని తన స్వగృహంలో మంగళవారం అందజేశారు. వారి ముగ్గురికి రూ.లక్ష 30 వేల చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ జిలకర మహేష్, సాంబార్ శేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఐద్వా సర్వే



నవతెలంగాణ-దహెగాం

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని హత్తిని, కల్యాడ గ్రామాల్లో ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సంవత్సరం ఉపాధిహామీ పనిని 70 రోజులు చేసినప్పటికీ కేవలం నాలుగైదు వేల రూపాయలు మాత్రమే కూలీలకు చెల్లించారని, ఒక్కో కుటుంబానికి సుమారు రూ.15 వేల వరకు కూలీ డబ్బులు రావాల్సి ఉందని, వెంటనే కూలీలకు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే కూలీలకు చీటీలు ఇవ్వాలని, ఏరోజు ఎంత పనికి ఎంత కూలి వచ్చిందో తెలుసుకోవచ్చని అన్నారు. ఉపాధిహామీ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రజిత, నాయకురాళ్లు కమల, లక్ష్మి, శోభ పాల్గొన్నారు.

బెంగాళీ క్యాంపులో నా భూమి నా దేశం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెంబర్ 1, 2లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అధ్వర్యంలో మంగళవారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. మేరి మట్టి మేర దేశ్ ప్రచారంలో బాగంగా 'అమత కలశ్' లో పిడికడు మట్టిని సేకరించేందుకు ప్రతీ ఇంటికి వెళ్ళి మట్టిని సేకరించడం జరిగిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగాలకు గుర్తుగా నిర్మించనున్న అమృత వనం కోసం 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్పూర్తితో దేశంలోని ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాళిదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోనీ శ్రీశైలం, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొలెం వెంకటేష్, రణ్వీర్, బికాస్, మందాడే సుధాకర్, మాచర్ల శ్రీనివాస్, అరుణ్ లోయ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-దహెగాం

అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు పుప్పాల లక్ష్మి, అమృత అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌తో పాటు అమర్‌గొండ అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోర బాలికలకు కిశోర అమృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుఏత్వం బాలలు, యుక్త వయసు పిల్లలకు అంగన్‌వాడీ ద్వారా అనేక పోషక పదార్థాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నార పద్మ, వజ్రమ్మ, లలిత, శ్రీలత పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం స్థలం పరిశీలన

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో మొగడ్‌దగడ్ నుంచి వైగాం వరకు మంజూరైన మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించడానికి పంచాయతీరాజ్ అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఈఈ రామ్మోహన్‌రావు, ఏఈలు రాజ్‌కుమార్, ముగ్బుల్ హుస్సేన్ ఉన్నారు.

పిడుగుపాటుతో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-భీమిని

మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఇంటిపై పిడుగు పడి పెను ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇదే క్రమంలో ఎస్టీ కాలనీకి చెందిన కాసు సత్తయ్య ఇంటిపై పిడుగు పడింది. ఆ సమయంలో ఇంట్లో పిల్లలు, తన భర్త ఇంట్లో లేక పోవడంతో ప్రమాదం తప్పిందని సత్తయ్య భార్య లలిత తెలిపారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం, వెలుగు వచ్చి ఇంటిపై పడిందని దీంతో ఇంట్లో ఉన్న బట్టలు కొన్ని వస్తువులు ధ్వంసం అయ్యాయని తెలిపారు. కొద్దిసేపు కండ్లు బైర్లు కమ్మి ఏమీ కనిపించలేదని ఆమె పేర్కొన్నారు. ఆ సమయంలో ఇంట్లో అందరు ఉండి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని వాపోయారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు

- హాజీపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-హాజీపూర్

ఎమ్మెల్యే దివాకర్ రావును విమర్శిస్తే సహించేది లేదని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్‌లో వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో ఎమ్మెల్యే కొందరిని దూరం పెట్టారని అన్నారు. అలాంటి వారే పార్టీ మారారని పేర్కొన్నారు. మండలంలో సర్పంచులు పార్టీ మారారని దుష్ప్రచారం మానుకోవాలన్నారు. కిరాయికి మనషులను కార్లలో ఎక్కించుకుపోయి వందల మంది పార్టీ మారారని చెప్పడం విడ్డూరం అన్నారు. మండలంలో అసలైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరు పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కేవలం దివాకరరావు ఆధ్వర్యంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని అన్నారు. అవినీతి మచ్చ లేని ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్ రావు, సర్పంచులు గోళ్ల శ్రీనివాస్, కొట్టే మహేందర్, మధుసూధన్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ నయీం పాషా, ఎంపీపీ కోఆప్షన్ రఫిక్, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, బేర పోచయ్య, లగిశెట్టి రాజయ్య, యూత్ అధ్యక్షుడు దొమ్మటి బాపు, సునీల్‌రావు పాల్గొన్నారు.

దేశానికి దశ దిశ చూపేది ఉపాధ్యాయులే

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దేశానికి దశ దిశ చూపేది ఉపాధ్యాయులేనని జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన గురుపూజోత్సవ వేడుకలకు ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కాడే హేమంత్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ, సరస్వతి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉన్నతమైన స్థానాన్ని కలిగి ఉన్నారని తెలిపారు. దేశ అభివృద్ధిలో వారి పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఎప్పటికప్పుడు సత్‌ప్రవర్తన కలిగి ఉండి దేశానికి వెన్నుముకగా ఉండాలని సూచించారు. కలెక్టర్ బోర్కడ హేమంత్ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో తల్లితండ్రుల తర్వాత స్థానాన్ని గురువుకు ఇవ్వడం జరిగిందని, బావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేని లోకాన్ని ఊహించలేమన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 44 మంది ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, ఎంపీపీలు మల్లికార్జున్, విమలబాయి, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, విద్యాశాఖ పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

కాగజ్‌నగర్ : ప్రతీ రోజు తరగతి గదులలో బుద్ధిగా కూర్చొని పాఠాలు వినే విద్యార్థులు మంగళవారం మాత్రం ఉపాధ్యాయులుగా మారి ఇతర విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్వయం పాలన పాటించారు. పిల్లలు పెద్దలుగా మారి తరగతి గదులలో పాఠాలు బోధించారు. ఆయా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు వెంకటయ్య, షేక్ చాంద్, శివలింగంలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయదేవ్ అబ్రహం, శివప్రసాద్ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. మురళీధర్‌రావు, ఎఎస్ఆర్ మూర్తి, పూర్ణచందర్‌రావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు యు నారాయణ, ఎల్లాగౌడ్, దేవయ్య, బంగారుబాబు, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

మందమర్రి : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఆ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యా దినోత్సవం సందర్భంగా గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. మొదటగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గురుపూజోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మంతెన రామయ్య, టి ఉషా రాణి, డి చంద్రకళ జగన్ మోహన్, మహేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

తాండూర్ : ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిగా నిలచిన డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియచేస్తూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. (శ్రీ వెంకట సాయి టెంట్ హౌస్) వద్ద నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, ఉపాధ్యాయులు సుధాకర్, ఎండీ రమ్జాన్ వెంకటేశ్వర్లు విద్యాసాగర్ సుధాపరిమలను సన్మానించారు ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ బొమ్మ బాపురెడ్డి, కార్యదర్శి లయన్ ఠాకూర్ ఉమ్రావ్ సింగ్, కోశాధికారి లయన్ మద్దికుంట రామచందర్, లయన్ సిహెచ్ సంగీతరావు, సిరంగి శంకర్, రామ్టెంకి శేఖర్, దేవరకొండ రాజన్న పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బురదగూడ ఎంపీపీఎస్, గజ్జిగూడ జడ్పీఎస్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ వేషాధారణలో అలరించారు. ఏటుకూరి శ్రీనివాసరావు, బిక్షపతి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణ సేవలను కొనియాడారు. అన్ని వత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గొప్ప అనుభూతిని కలిగిస్తుందని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో బురదగూడ సర్పంచ్ చటారె స్వాతీ, ప్రధానోపాధ్యాయుడు ఏటుకూరి శ్రీనివాసరావు, భిక్షపతి, కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాక శ్రీనివాస్, మనోజ్ కుమార్, బండరీనాథ్, అన్నపూర్ణ, వనిత, సునీత, ఝాన్సీ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించారు. ఒక్క రోజు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించడం వల్ల ఉపాధ్యాయుల శ్రమ తెలిసిందని విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఉపాధ్యాయ వేషధారణలో మంచి విద్యా బోధన అందించిన విద్యార్థులు మొదటి బహుమతి జోయా, రెండో-బహుమతి మహేశ్, హెచ్ఎంగా విధులు నిర్వహించిన నరేందర్‌కు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాథోడ్ రమేశ్, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణగోపాల్‌రావు, మాధవి లత, అనసూర్య పాల్గొన్నారు.

దహెగాం : మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ అమరేందర్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారిన తోటి విద్యార్థులకు బోధన చేశారు.



కాగజ్‌నగర్ రూరల్‌లో..



తాండూర్‌లో..



దహెగాంలో..

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-తాండూర్



ఆశలకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండలంలోని ఆశ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తాండూర్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి కుమారస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రాజారాం మాట్లాడుతూ ఆశలకు ఉద్యోగ భద్రత తోపాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశాలకు ఉద్యోగున్నతులు కల్పించాలన్నారు. టీబీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలనికోరారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు రాజేశ్వరి, తిరుమల, విజయలక్ష్మి, సుజాత స్రవంతి, మల్లేశ్వరి, సునీత పాల్గొన్నారు

భీమిని : మండలంలో ఏండ్ల తరబడి ఆశా కార్యకర్తలుగా విధులు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది చేసే పనిని కూడా తామే చేస్తూ సేవలందిస్తున్న తమను ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదని ఆశా కార్యకర్తలు అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం రూ.26 వేల చెల్లించాలని ప్రతి ఆశా కార్యకర్తకు ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలని ప్రమాద బీమా అందించాలని డిమాండ్ చేశారు.

కౌటాల : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మండలంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యురాలు నవతకు అందజేశారు. ఆమె వినతిపత్రాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని వారికి సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిని నేహా తస్లీమాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాల పారితోషికాలను రూ.18 వేలకు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగభద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు, ప్రమాదబీమా రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, ఏఎన్ఎం, జీఎంఎన్ పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శ్రీలత, లక్ష్మి, రాజేశ్వరి, శిరీష, సుజాత, అనసూర్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాలకు స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రి, ప్రజా లైఫ్‌కేర్ ఆస్పత్రులలో మంగళవారం వేర్వేరుగా నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరాలకు స్పందన లభించింది. స్థానిక కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి 16 మంది హాజరు కాగా ముగ్గురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫ్తామాలజిస్టులు వసీ, గోపి పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజా లైఫ్‌కేర్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో 21 మందికి పరీక్షలు నిర్వహించగా, ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్ఎం కార్మికులు చేస్తున్న ఆరవ రోజు దీక్ష సందర్భంగా కార్మికులతో కలిసి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సర్వీస్ రెగ్యులరైజ్ చేయకపోవడం దారుణమన్నారు. ఈ విభాగాల్లో అతి తక్కువ వేతనాలతో పనిచేసేవారు ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నేషనల్ హెల్త్ మిషన్స్ స్కీమ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కౌన్సిలర్ సదానందం డీఈఓలు సాయి, వెంకటేష్, షకీల్, శ్రీదేవి, మమత, ఎల్టీలు రజిని, అనూష, సౌందర్య, సంధ్య, ఎస్ఎన్‌లు కమల, సులోచన, చామంతి, జ్ఞానేశ్వరి, కాంటినెంట్ వర్కర్స్ ముస్తాక్, మాయ, లక్ష్మీ, చంద్రకళ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తానని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట 9వ రోజు మంగళవారం భారీ వర్షంలో కూడా నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన జడ్పీచైర్ పర్సన్ కోవలక్ష్మిని కలిసి పరిస్థితి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి వారి సమస్య తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. 9వ రోజు ఉద్యోగులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని గీసి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగుల నిరసన దీక్షకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్యశాంతకుమారి, ప్రధాన కార్యదర్శి ఇందురావు, నాయకులు ఊశన్న, హేమంత్ షిండే, తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖమర్ హుస్సేన్‌లు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి పవన్, నాయకులు సందీప్, శ్రీనివాస్, మహేష్, రాజేష్, రమణ, తిరుమల, మమత పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ గొల్లవాడ సమీపంలో విద్యుత్ షాక్‌తో ఐదు గేదలు అక్కడికక్కడే మృతి చెందాయి. మేతకు వెళ్లిన గేదలు వర్షం తీవ్రంగా ఉండడంతో తిరిగి వస్తున్న క్రమంలో గేదల మందపై విద్యుత్ వైర్ తెగి పడడంతో ఐదు గేదలు అక్కడికక్కడే మృతి చెందగా మిగితా గేదలు పరుగులు తీశాయి. గడ్డి కుమార్, పార్వతి సత్తయ్య, షేక్ ఇమామ్, కసర్ల లస్మయ్య, జంగిల్ రాజ్కుమార్లకు చెందిన ఒక్కో గేదె మృతి చెందింది. సుమారు రూ.3 లక్షల వరకు గేదెల విలువ ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గేదెలు మృతి చెందిన సంఘటన స్థలాన్ని పరిశీలించి గేదెల యాజమానులను పరామర్శించారు.

4

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

బుధవారం | సెప్టెంబర్ 06, 2023 | www.navatelangana.com

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

రామకృష్ణాపూర్ : అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ బాలుర పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దామోదరరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ 320జి డిస్ట్రిక్ గవర్నర్ రాజిరెడ్డి ,పిజిడి శివ ప్రసాద్ జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజేష్ కన్నా, దేవేందర్‌రెడ్డి ,వేణుగోపాల్, సత్యం, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, నారాయణరెడ్డి, చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, గణపతి, రాజు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న రమేష్

జన్నారం : మండలంలోని కలమడుగు గ్రామ జడ్పీ పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు మురిమడుగు రమేష్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రమేష్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం మహబూబ్ అలీ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. సిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముఖ కమలాకర్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి ఎంఈఓ విజయ్ కుమార్, జడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన ఆయనను అభినందించారు.



ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో పట్టణంలోని పోచమ్మ బస్తీ, అంబేద్కర్ కాలనీ, జైభీంకాలనీ, సర్దార్ బస్తీ, మండలంలోని ఈజ్ గాం, నజ్రుల్ నగర్ విలేజ్ నెంబర్ 1, మార్కెట్ ఏరియా, దహెగాం మండలం హత్తిని, కాల్వడ గ్రామాల్లో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్పీఎంలో ఉద్యోగాలు స్థానికేతరులకు ఇచ్చి తమకు కాలుష్యాన్ని అప్పగించారని పట్టణ వాసులు వాపోతున్నారని తెలిపారు. కాలుష్య నియంత్రణకు మిల్లు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త మేనేజ్‌మెంట్ వచ్చిన తర్వాత నీటిని కూడా సరిగా ఇవ్వడం లేదని చెప్పారు. కాగజ్‌నగర్ పట్టణ సమస్యలపై ఇతర సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పని 70 రోజులు చేసినప్పటికీ కేవలం 4000 నుండి 5000 వరకు కూలీ ఇచ్చారని, ఇంకా ఒక్కో కుటుంబానికి 14000 నుండి 15000 వరకు కూలీ డబ్బులు రావాల్సి ఉందన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సర్వేల్లో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.రజిత, నాయకులు యస్. కమల, లక్ష్మి మమతరాణి, వీణా, సుచిత్ర, బుర్రి లక్ష్మి, శోభ, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూపోరాట సమితి పేదలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్



నవతెలంగాణ-చెన్నూర్

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఐదు నెలలుగా పోరాటం చేస్తున్న భూ పోరాట సమితి పేదలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. మంగళవారం భూపోరాట కేంద్రాన్ని సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడులేని నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు భూకబ్జాదారులకు అండగా ఉన్నారని తెలిపారు. పేదలపై దాడులు జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఇంతవరకు దాడి చేసిన వారిని అరెస్టు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం కల్పించుకొని దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో నష్టపోయిన వారికి నిత్యావసర సరుకులు అందజేసి ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు నాగరాజు, మల్లికార్జున్, రాజ్‌కుమార్, సంపత్, సాయి ఉన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి



నవతెలంగాణ-తాండూర్

మండలంలో 210 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటల పెంపక లక్ష్యాన్ని క్షేత్రస్థాయి అధికారులు పూర్తి చేయాలని డిఆర్‌డిఓ నోడల్ అధికారి సదానందం తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ, ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2535 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు చేయూతనందిస్తుందని తెలిపారు. అందులో భాగంగా మండలంలో లక్ష్యాన్ని ఛేదించే దిశగా క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ, వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో రైతులను ప్రోత్సహించాలన్నారు. పండ్ల తోటల పెంపకానికి గ్రామపంచాయతీల వారీగా రైతులను గుర్తించి 5ఎకరాల లోపల ఉన్న రైతులను మోటివేషన్ చేయాలని తెలిపారు. రెండు రోజులలో రైతులను గుర్తించి డాక్యుమెంట్స్ తీసుకొని ఎస్టిమేషన్ చేయాలన్నారు. ఈ సేవ కేంద్రాలలో ఎంబిపి రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వి.ప్రవీణ్‌కుమార్, అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్మయి, ఏపిఓ నందకుమార్, ఈసి రమేష్, టిఎ లక్ష్మీ, రాజేంద్రప్రసాద్, ఏఈఓ శంకర్, ధనలక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.

జన్నారంలో నేషనల్ ఛారిటి డే

నవతెలంగాణ-జన్నారం

నేషనల్ ఛారిటి డేను పురస్కరించుకొని మండలంలోని స్లేట్ ఎక్స్‌లెన్స్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు, కరస్పాండెంట్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ, బుడగజంగాల కాలనీ, అనాథాశ్రమంలో పండ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్ననాటి నుండి ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, సూరజ్, రమేష్, ఫెరోజ్ పాల్గొన్నారు.



భావితరాలను తీర్చిదిద్దం ఉపాధ్యాయులకే సాధ్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ భావితరాలను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. గురువుల మార్గనిర్దేశకత్వంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. పిల్లలకు విద్యార్థి వ్యవస్థలో గురువులు నేర్పిన పాఠాలు చాలా బలంగా ఉంటాయని, తెలంగాణ ప్రభుత్వంలో విద్యారంగం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల 65 పాఠశాలలకు 7వేల289 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థలను నాణ్యతా ప్రమాణాలతో బలోపేతం చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తయారు చేసి విద్యార్థులకు సకల సౌకర్యాలు నడుమ మెరుగైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలలో నిలిచిన అనేక మంది తరగతి గదులలో ఉపాధ్యాయులు నేర్పించిన పాఠాలే మూలమని, ఉపాధ్యాయులు, పిల్లలు రోజులో ఎక్కువ సమయంలో పాఠశాలలోనే గడుపుతారని అన్నారు. అనంతరం క్రమశిక్షణ, సమయపాలన, డ్రాపవుట్ల తగ్గింపు, నైతికత, విద్యార్థుల సంఖ్య పెంపుదల, వినూత్న బోధన పద్ధతులు అవలంభించడం, హరితహారం కార్యక్రమం నిర్వహణ, ఆధార్ అనుసంధానం లాంటి అంశాలలో ఉత్తమ సేవలు అందించిన 90 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఎస్.యాదయ్య, డీఆర్‌డీఓ బి.శేషాద్రి, జడ్పీ సీఈఓ నరేందర్ పాల్గొన్నారు.

పేదలపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలి

- భూపోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



నవతెలంగాణ-చెన్నూర్

పేదలు నివాసం ఉంటున్న పూరి గుడిసెలను తగులబెట్టి, వారిపై దాడులు చేసిన భూ కబ్జాదారి వెంటనే అరెస్టు చేయాలని భూ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భూ పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రం వద్ద బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వ భూములను భూ కబ్జాదారులు కబ్జాలు చేస్తుంటే వాటిని రక్షించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసైన్ భూములను పేదలకే పంచాలని వాటిని అమ్మడం కానీ కొనడం కానీ చేయరాదని జీఓ ఉన్నప్పటికీ భూ కబ్జాదారుల ఆక్రమణకు గురవుతోందన్నాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సంకే రవి మాట్లాడుతూ నలుగురు భూ కబ్జాదారులు ప్రభుత్వ అసైండ్ భూమిని కబ్జాచేస్తే వాటిని రక్షించాలని గత 5 నెలలుగా పోరాటం చేస్తున్న పేదలపై దాడులు జరిగితే పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. వారిపై ఫిటిషన్ ఇచ్చి 3 రోజులు గడుస్తున్న అరెస్టులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. 4 సార్లు కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన అక్రమ పట్టాలు ఎందుకు క్యాన్సల్ చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైన వారిపై చర్యలు తీసుకోని పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటి సభ్యుడు బోడంకి చందు, పట్టణ కార్యదర్శి ఎండీ హవేశ్, కోటపల్లి మండల కమిటీ సభ్యుడు రవి, గుడిసెల వాసులు సరిత, మనీ, సంధ్య పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాన్ని ముట్టడించిన ఏఐటీయూసీ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

11వ వేజ్ బోర్డ్ 23 నెలల ఏరియర్స్ మొత్తాన్ని, సంస్థకు వచ్చిన లాభాల్లో 35 శాతం వాటాను కలిపి ఒకేదఫా చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా పాల్గొని మాట్లాడారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏరియర్స్ చెల్లింపులో యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తుందని ఒకటో వేజ్ బోర్డు నుండి పదోవేజ్ బోర్డు వరకు ఏరియర్స్ చెల్లింపులో సింగరేణి కోల్ ఇండియా కంటే ముందుగానే చెల్లించేదని కానీ 11వ వేజ్ బోర్డులో సింగరేణి కంటే ముందే కోల్ ఇండియాలో ఒకే దఫా ఏరియాస్ చెల్లింపులు జరిగాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు వచ్చిన లాభాలను అప్పనంగా కాజేస్తున్నాయని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.29వేల కోట్లను చెల్లించకపోవడం వల్ల యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన ఏరియర్స్, లాభాల వాటా చెల్లింపులో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఏరియర్స్ ఒకే దఫా చెల్లించకుంటే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, దీనికి పూర్తి బాధ్యత యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏరియా కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, సారయ్య, పిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, బీరా రవీందర్, మురళీ చౌదరి, గునిగంటి నరసింహారావు, మోహన్‌రెడ్డి, చిలుక రాంచందర్, కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికలపై పోలీసుల ప్రత్యేక నిఘా

నవతెలంగాణ-జన్నారం

ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో తీసుకో వాల్సిన జాగ్రత్తలు, మావోయిస్టుల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడానికి మండల కేంద్రంలో గల హరితా రిసార్ట్‌లో నిర్మల్, మంచిర్యాల జిల్లా పోలీసులు ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహించారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో తెలంగాణ రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళిక రూపొందించడానికి సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో మద్యం, నగదు సరఫరా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులు చర్చించారు. జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశం, నిష్క్రమణ మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేసేలా నిర్ణయాలు తీసుకున్నారు. అదే విధంగా గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్థులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలను రూపొందించడం జరిగిందని మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. సమావేశంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, లక్షెట్టిపేట సీఐ కృష్ణ, ఖానాపూర్ సీఐ మోహన్, నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, జన్నారం, కడెం, దస్తురాబాద్ ఎస్సైలు పోచంపల్లి సతీష్, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

హాజీపూర్: మంచిర్యాల నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్, ప్రజాప్రతినిధులు ఆపార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం మంచిర్యాల, హజీపూర్, లక్షెట్టిపేట, నస్పూర్, దండేపల్లి మండలాలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ తరలివెళ్లారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వారి రాజీనామా పత్రాలను తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సమర్పించి నివాళ్ల అర్పించారు. అనంతరం హజీపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించారు. భారీ కాన్వాయ్ తో హైదరాబాద్ వెళ్లారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ ఇన్‌ఛార్జి మానిక్ రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరిలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. హాజీపూర్ జడ్పీటీసీ పుస్కురి శిల్ప, హాజీపూర్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ రాచకొండ ఆశాలత వెంకటేశ్వరరావు, హాజీపూర్ మాజీ ఎంపీటీసీ బొడ్డు శైలజ శంకర్, హాజీపూర్ టీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దొమ్మటి సత్తయ్య, వేంపల్లి మాజీ సర్పంచ్ గోనె సంజయ్, సీనియర్ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు నాయకులు సిరిపురం శ్రీనివాస్, ఉప సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరపు, జితేందర్‌రావు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ బీఆర్ఎస్ తాజా మాజీ పట్టణ అధ్యక్షుడు సాగే సుమోహన్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ మురళీధర్ నాయకులు సంగతి మురళి, బొడ్డు తిరుపతి, చెల్ల రమేష్, కారుకురి తిరుపతి, నాగేశ్వరరావు వీరితో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే దివాకర్ రావు, విజిత్ రావు ఒంటెద్దు పోకడలకు విసిగిపోయి బీఆరెస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరినట్లు వారు తెలిపారు.



సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయి



నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని హాస్టల్ తండా గ్రామ సర్పంచ్ బానవత్ జయశ్రీ సంతోష్ అన్నారు. మంగళవారం గ్రామ కార్యదర్శి వరలక్ష్మి చేసిన సేవలకు ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడంతో పంచాయతీ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని మండలంలో ప్రథమ స్థానంలో నిలపడానికి సహకరించాలని కోరారు.

దీక్షకు జానుబాయి మద్దతు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో 132 కెవి సబ్‌స్టేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని నిరసన దీక్ష చేస్తున్న నాయకుడు భూమాచారికి బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు భూక్య జానుబాయి మంగళవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 132 కెవి సబ్‌స్టేషన్ వెంటనే ఏర్పాటు చేసి ప్రజల సమస్యను తీర్చాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. నాయకులు గోలి చందు, కొండపల్లి మహేష్, అరవింద్ పాల్గొన్నారు.

ఆదాయాన్నిచ్చే వనరులుగా పండ్ల తోటలు



నవతెలంగాణ - బెజ్జూర్

రైతులకు ఆదాయాన్నిచ్చే వనరులుగా పండ్ల తోటలు నిలిచిపోతాయని డీఆర్‌డీఓ సురేందర్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీయస్, ఐకేపీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండ్ల తోటల పెంపకం కోసం రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి మొక్కలను అందజేస్తున్నామన్నారు. ఒక్కసారి తోట అభివృద్ధి చెందితే ప్రతి సంవత్సరం ఆదాయం సమకూరుతుందని, దీంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఇందిరాక్రాంతి పథకం ద్వారా ఎంటర్‌ప్రైజేస్ ఏర్పాటు కోసం రుణాలను అందిస్తున్నామని, వీటిని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఏపీఓ చంద్రయ్య, ఏపీఎం బద్రయ్య, ఐకేపీ, ఈజీయస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ -వేమనపల్లి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గొర్లపల్లి గ్రామంలో నడుస్తున్న వాల్మీకి ప్రైవేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్ డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలు లేకుండా ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. రేకుల షెడ్‌లో విద్యాబోధన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, రమేశ్, టివిజెఎస్ బచ్చలి ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

9న లోక్ అదాలత్

సిర్పూర్(టి) : ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి పి రవి తెలిపారు. మంగళవారం సిర్పూర్ జూనియర్ సివిల్‌కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించుకునే విధంగా కక్షిదారులతో సంప్రదింపులు జరిపాలన్నారు. కేసులు కొట్టేసే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి కిశోర్‌కుమార్, రైస్ హైమద్, శంకర్‌రావు, సీహెచ్ శ్రీనివాస్, బి శ్రీనివాస్, గణపతి, సతీష్, కళ్యాణ్, దయరాజ్‌సింగ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

దండేపల్లి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సంఘర్ష రాజేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయుడిగాఎంపికయ్యారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకోని మిత్రబందం, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ వత్తిలో విద్యార్థులకు ఎందరికో మార్గదర్శిగా నిలుస్తూ విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకెళ్లిన ఘనత రాజేశ్వరరావ్‌దని కొనియాడారు. భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిలో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

శిక్షణ పొందిన మహిళలకు రాత పరీక్షలు

మందమర్రి: 2022-23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సంస్థ ద్వారా వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం రాత పరీక్షలు ఉంటాయని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన 261 మంది మహిళలు, యువతులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 10:00 నుంచి 1:00 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం బోథ్‌లోనే ఏర్పాటు

నవతెలంగాణ-బోథ్

పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం బోథ్‌లోనే ఏర్పాటు అవుతుందని సర్పంచ్ సురేందర్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఫ్రెండ్స్ క్లబ్ పక్కన ఏర్పాటు చేసిన పశు వైద్యశాఖ కార్యాలయంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ సురేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం బోథ్ మండల కేంద్రంలోని క్లబ్ పక్కన కార్యాలయం ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఇక నుంచి పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు బోథ్ నుంచి కొనసాగుతాయని అన్నారు. ఆలాగే ఇకనుంచి అధికారులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లింభాజీ, నాయకులు చెట్ల ఉమేష్, నారాయణరెడ్డి, ఎలక రాజు, గోవర్ధన్, గట్ల గంగాధర్, సోలంకి సత్యనారాయణ, రఫీ, రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



టీడీపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తెలుగు యువత అధ్యక్షుడు గాలిపెల్లి నాగన్న తన పేరును ఖారారు చేయాలని టీడీపీ కేంద్ర అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడిని కోరారు. దానికి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. యువతను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సంధ్య, పోగు రాజశేఖర్, మండల అధ్యక్షులు పోచన్న, అంకుష్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదసీదాగా కొనసాగింది. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సీజనల్ వ్యాధులు సంభవిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. ప్రతి సమావేశంలో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి విన్నవిస్తున్నామని, కానీ సమస్యలు పరిష్కారం మాత్రం కావడం లేదని అన్నారు. సమస్యలు పరిష్కారం కానీ సమావేశాలు ఎందుకని పలువురు సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్, తహసీల్దార్ ప్రవీణ్, జెడ్పీటీసీ చంద్రకళ, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ నాయక్, వైస్ ఎంపీపీ సాగర్ బాయి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగుపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పత్తి పంటలో ఆశించే గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు శ్రీధర్ చవాన్, డా.రాజశేఖర్ అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని పిట్టబొంగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని, పత్తి పంట 45 రోజులు వచ్చే సరికి గులాబీ పురుగు ఆశించే అవకాశం ఉన్నందున ఏకరానికి 5, 6 లింగాకర్షక బుట్టలను ఆమర్చలని సూచించారు. దాంతో పాటు ప్రోఫినో పాస్ 2 శాతం, క్లోరిఫైరి ఫాస్ 2బీ5 లేదా ఇమ్మామెక్టిన్ బెంజోయట్ లేదా స్పీనోసాడ్ లేదా క్వినాల్ ఫాస్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు భీంరావ్, జాకు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో లఘునాటిక ప్రదర్శన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆర్థిక సదుపాయం, నైపుణ్య అభివృద్ధి, సాంకేతిక నైపుణ్యాలు, మార్కెటింగ్ తదితర తయారీ పోటీ తత్వంపై లఘునాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జలగం అనిత, ఈడీసీ కోఆర్డినేటర్ చంద్రకాంత్, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రెషర్ కుక్కర్ల పంపిణీని అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల నోటిఫికేషన్ లేదు ఎలక్షన్ కోడ్ లేదు అయినా తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న ప్రెషర్ కుక్కర్ల పంపిణీ అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని బిల్లులు టాక్స్‌లు చెల్లించి కొనుగోలు చేసిన కుక్కర్లను పేద మహిళలకు పంచుతున్నట్టు ఆయన తెలిపారు. దీనికి వస్తున్న స్పందన, ఆదరణ తట్టుకోలేక అధికారాన్ని అడ్డం పెట్టుకొని పోలీసుల చేత కుక్కర్లు నిల్వ చేసిన గదిని సీజ్ చేయడం సరైంది కాదన్నారు. జోగు రామన్నకు ఓటమి భయం పట్టుకుందని అందుకే ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. 24 గంటల్లో సీజ్ తొలగించాలని లేదంటే వేలాది మహిళలతో జోగు రామన్న ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మహిళల కోసం ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని అడ్డుకోవడం జోగు రామన్న కుట్రలకు పరాకాష్ట అన్నారు. తప్పు మీద తప్పు చేస్తున్న ఆయనకు మహిళలే తగినరీతిలో బుద్ధిచెబుతారని హితవు పలికారు. పోషకాహార లోపాన్ని పరిష్కరించాలనే మహిళలకు కుక్కర్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కుక్కర్ల పంపిణీని అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలుకాలనీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.



నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ-ఉట్నూర్

నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక కేబీ ప్రాంగణంలోని పీఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీడీఏ పీఓ పాల్గొని, ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యకు సర్వోతోముఖాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జగ్‌రాం అంతర్వేది మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని ఆర్జించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి అశ్రఫ్ అలీ, అధ్యాపకులు జాకీర్ హుస్సేన్, ప్రతాప్ సింగ్, శ్రీనివాస్, రఘునాథ్, సంతోష్ కుమార్, రమేశ్, నర్సింగరావు, విజయ్ కుమార్, అనిత, రాజ్ కుమార్, ఆనంద్ విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రూయ్యడి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను గ్రామ సర్పంచ్ పుంద్రు పోతారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దిలీప్ రెడ్డి, గ్రామ పెద్దలు ప్రకాష్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, చిన్న ప్రకాష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పాఠశాల వైస్ చైర్మెన్ ఉత్తమ్ పాల్గొన్నారు.

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైన్స్‌క్లబ్ గవర్నర్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కృషి విజ్ఞాన్ కేంద్రం దత్తత గ్రామమైన లచ్చంపూర్ గ్రామంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగమ్మ రాజేశ్వర్, కృషి విజ్ఞాన కేంద్ర అధికారి ప్రవీణ్ కుమార్, విజయ డెయిరీ అధికారి మధుసూదన్ రావు, విస్తరణ అధికారి శివచరణ్, లైన్స్‌క్లబ్ కన్వీనర్ ప్రకాష్ కాలేవార్, లైన్స్‌క్లబ్ సభ్యులు దేవిదాస్, బండారి దేవన్న, ప్రధానోపాధ్యాయులు నవీన్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరడిగొండ : ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను తేజపూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు (ఎఫ్ఏసీ) ఎస్.శ్రీనివాస్‌గౌడ్, నేరడిగొండ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి, ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ సుధారాణిలను పాఠశాల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు.

నార్నూర్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు తరగతిలో పాఠాలు బోధించారు. పాఠాలు మంచిగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానించారు.

బోథ్ : మండల కేంద్రంతో పాటు ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు వేదం, నాగభూషణం, వివేకానంద, ఉషోదయ, సొనాలలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ నిర్వహించి, ఉపాధ్యాయుని గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్‌లు సంతోష్, కిషోర్, కృష్ణ చైతన్య, సిబ్బంది ఓరుగంటి ఇస్తారి, శుద్ధోధన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మొదటగా ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రసంగిస్తూ వివిధ యూనివర్సిటీలలో పీజీ సీట్స్ పొందిన విద్యార్థుల్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గత 7 సంవత్సరాలుగా నిరాటంకంగా నిరంతరం వెంట ఉండే వివిధ విభాగ అధిపతులు ప్రిన్సిపాల్ చైర్మెన్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోనే అతి తక్కువ కాలంలో మన కాలేజ్ ఒక గుర్తింపు పొందిన విద్యావ్యవస్థగా మారిందని భవిష్యత్‌లో ఇంకా అభివృద్ధి వైపు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని దీనికి సహకారాన్ని అందివ్వాలని విద్యార్థులని, అధ్యాపక బృందం యాజమాన్యాన్ని కోరారు. కేవలం రాష్ట్రస్థాయితో ఆగిపోకుండా జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులు యూనివర్సిటీల్లో సీట్స్ వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల విభాగాధిపతి గెడం ప్రవీణ్, హిందీ విభాగం ఆమోల్, భౌతిక శాస్త్ర విభాగం పుష్ప, రసాయన శాస్త్ర విభాగం కిష్టారెడ్డి, ఆర్ట్స్ విభాగం సాగర్, గణిత విభాగం బిందు, వాణిజ్య శాస్త్ర విభాగం కుమారి సౌందర్య, మరాఠీ విభాగం ప్రియాంక, జంతు శాస్త్ర విభాగం విజయ, తెలుగు విభాగం సంజీవ్‌లకు ఉత్తమ అధ్యాపక అవార్డులను అందజేసి సన్మానించారు.

పెరిగిన ధరలు తగ్గించి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్, ఆదిలాబాద్ రూరల్

పెరిగిన ధరలు తగ్గించి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలని, అధిక ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆదిలాబాద్ అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ధరలను తగ్గించడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఉన్న ఉద్యోగాలకు ఎసరు తీసుకొచ్చే పనిచేస్తూ కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతున్నారని అన్నారు. యువకులను అగ్నిపథ్ పేరుతో కాంట్రాక్టు ఉద్యోగాలతో భర్తీ చేసి ఉపాధి భద్రతను దూరం చేస్తోందని అన్నారు. మరో వైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి దాన్ని నిర్వీర్యం చేసే పని చేస్తున్నారని అన్నారు. నిత్యవసర వస్తువులు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రోజురోజుకు పెంచుతూ సామాన్యులను నడ్డి విరుస్తున్నారని అన్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కట్టబెడుతున్నారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం తొమ్మిదేండ్ల పాలనలో రూ. 100 లక్షల కోట్ల అప్పు చేసి ప్రజలపై చరిత్రలో ఎన్నడూ లేనంత ఆర్థిక భారాలను మోపిందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగారాం, మండల నాయకులు, శంకర్, రాజక్క ఉన్నారు.



ఆదిలాబాద్‌రూరల్



ఉట్నూర్

ఉట్నూర్ : పెరిగిన నిత్యావసం ధరలను ప్రభుత్వాలు ధరలు తగ్గించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్ అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగిందన్నారు. ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నాయని ఆరోపించారు. అటు దేశాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఇటూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో అప్పులు చేసి ప్రజలపై ఆర్థిక భారాలను మోపుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, పేపర్ల లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రభుత్వ రంగంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ(ఎం) జిల్లా, మండల నాయకులు కనక మల్కు, ఉయిక విష్ణు, నాగోరావ్, శంభు ఉన్నారు.

2000 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా ఈయనే..

- జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- జ్ఞాపకాలను నెమరవేసుకొని.. కలెక్టర్‌తో పంచుకొని..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కలెక్టర్‌గా ఆదిలాబాద్‌లో పని చేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా పర్యటన సందర్భంగా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయనకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. కార్యాలయంలోని ఖజానా శాఖ, రెవెన్యూ విభాగాలను పరిశీలించి, అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలో పనిచేసిన కలెక్టర్ల జాబితాలో తన పేరును చూసి ఆనందం వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన అనుభవాలను ప్రస్తుత కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2000 సంవత్సరం నుంచి 2002 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించడం మారిపోలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. గతంలో ఫైల్‌లను మాన్యువల్‌గా చేయడం జరిగేదని, ప్రస్తుతం ఈ-ఆఫీస్ వంటి ఆన్‌లైన్ విధానం ద్వారా త్వరితగతిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడిందని అన్నారు.

ఎన్నికల కమిషన్ పోస్టర్‌ల ఆవిష్కరణ..

ఓటరు నమోదును ప్రోత్సహించేలా పోస్టర్‌ల, షార్ట్ వీడియో ఛాలెంజ్‌కు సంబంధించిన ఎన్నికల కమిషన్ పోస్టర్‌ను ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీఓ స్రవంతి, డీటీఓ నిహారిక, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా పాల్గొన్నారు.



రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసిన గోక గణేశ్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఆర్థిక కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా పర్యటనకు రాగా మంగళవారం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. గతంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన రామకృష్ణారావు జిల్లా వాసులకు సుపరిచితుడేనని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావును మంగళవారం టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను సత్వరమే విడుదలయ్యేలా చూడాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు ఎస్.అశోక్ , ప్రధాన కార్యదర్శి ఏ.నవీన్ కుమార్, తిరుమల్‌రెడ్డి, రాజేశ్వర్, చిట్ల గంగాధర్, మెదరి నవీన్ పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రుణమాఫీ అయిన రైతులకు పంట రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక టీటీడీసీ సమావేశ మందిరంలో రుణమాఫీపై వ్యవసాయ, బ్యాంకు అధికారులతో ఆయన సమీక్ష సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 2018 నాటికీ రుణాలు తీసుకున్న 40వేల మంది రైతులకు రూ. 264 కోట్ల పంట రుణం మాఫీ అయిందన్నారు. మిగిలిన రైతులకు దశలవారిగా రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. బ్యాంకుల వారీగా రుణమాఫీ పొందిన రైతులకు తప్పనిసరిగా తిరిగి పంట రుణాలను మంజూరు చేయాలనీ బ్యాంకు అధికారులకు సూచించారు. రుణమాఫీలో సమస్యలున్న రైతుల జాబితాను సిద్ధం చేసి అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి రమేష్, శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బ్లూభీం యూత్ సభ్యులు



నవతెలంగాణ-తలమడుగు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బ్లూభీం యూత్ సభ్యులు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కలిశారు. గతంలో ఉపాధ్యాయులుగా బోధించిన ఎమ్మెల్యేను యూత్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, బ్లూభీం యూత్ సభ్యులు శేఖర్, సురేష్, ప్రసాద్, గంగన్న, ప్రశాంత్, రూపేష్, అఖిలేష్, అరవింద్, గంగాధర్, అనిల్, అశోక్, శివమణి, రాజు, అజయ్, జైపాల్, వంశీ, వినయ్ పాల్గొన్నారు.

హైకోర్టు రిజిస్ట్రార్‌ను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని మంజూరు చేయడాన్ని హర్షిస్తు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వామన్‌రావు దేశ్‌పాండే, పంద్రం శంకర్‌లు హైకోర్టు రిజిస్ట్రార్ నర్సింగ్‌రావ్‌ను కలిశారు. భవనాన్ని మంజూరు చేయడంతో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. కోర్టు భవనానికి రూ.11 కోట్లు, జడ్జి బంగ్లాకు రూ. 2 కోట్లు మంజూరయ్యాని తెలిపారు. అన్ని విధాలుగా సహకరిస్తున్న రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జిల్లా హైకోర్టు జడ్జిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రూపేందర్ సింగ్, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యా సాధన సులువు

నవతెలంగాణ-ఉట్నూర్

కష్టంతో పాటు పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని ఆంధ్ ఆదివాసీ సంఘం జిల్లా నాయకులు ముఖాడే ఉత్తం అన్నారు. కల్లూరుగూడ గ్రామానికి చెందిన నందు ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా మంగళవారం సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. నిరుపేద గిరిజన ఆదివాసీ కుటుంబంలో పుట్టిన నందు ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం ఆదివాసీ సమాజానికి ఆదర్శనీయమని అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో నుంచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు నందును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా నాయకులు వికాస్, బాబాసాహెబ్ ఉన్నారు.

11న జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 11న జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కాపీ, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, కుల ధృవీకరణ, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్, రెండు పాస్ ఫోటోలతో మేళలో పాల్గొనాలని పేర్కొన్నారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు అప్రెంటిస్ షిప్ యాక్ట్ ప్రకారం ఫండ్‌ని శిక్షణ కాలంలో నేరుగా అభ్యర్థుల అకౌంట్లో జమ చేస్తారని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ప్రిన్సిపాల్



నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను బోథ్ గురుకుల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లు మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా అందుకున్నారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల బాలికలు బోథ్ ప్రిన్సిపాల్ బీఎం.స్వర్ణలత, అదేవిధంగా హైదరాబాద్‌లో సాంఘీక సంక్షేమ గురుకుల శాఖ హైదరాబాద్‌లో సెక్రటరీ నవీన్ నికోలస్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ అందుకున్నారు. గురుకుల సాంఘిక సంక్షేమ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు.

హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యం సాధించాలి

నవతెలంగాణ - కాసిపేట

మండలంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని సాధించే దిశగా రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీఓ ఎంఎ ఆలీం అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో హార్టికల్చర్ ప్లాంటేషన్‌పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యం నెరవేర్చాలని, 5 ఎకరాల లోపు ఉన్న రైతులు గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. 7వ తేదీలోపు దరఖాస్తులను తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ దేవులపల్లి వందన, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతి

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట1 గనిపై, కాసిపేట 2 ఇంక్లైన్ గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మాజీ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, వెజోర్డ్ సభ్యులు మనుబోతుల కొమురయ్య 27వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, సీహెచ్ లింగయ్య, సంపత్, సంతోశ్, రఘురాం, రాజన్న, రత్నం కుమార్, మహేష్, గొల్ల శ్రీనివాస్, సుభాష్ చంద్రబోస్, మొయినొద్దీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కెరమెరి : మండలంలోని ఏడుగురు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ హేమంత్ సహదేవరావ్ బొర్కుడె చేతుల మీదుగా జిల్లా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ పురస్కారాలు అందుకున్న వారిలో జాదవ్ రవీందర్(ఉన్నత పాఠశాల కెరమెరి), టేకం భాస్కర్(ఎంపీపీఎస్ కెరమెరి), తిరుమలేశ్(సుల్తాన్‌గూడ పీఎస్ హెచ్ఎం), రాథోడ్ లెవెన్ కుమార్(ఎంపీయూపీఎస్ ఝరి), జయ రమేష్(ఎంపీపీఎస్, సావర్ ఖేడ), మాసాడే దివ్యశ్రీ (ఎంపీపీఎస్ కలగం), కోట్నాక ప్రవీణ్ కుమార్(పీఈటీ) ఉన్నారు.

ఓటరు జాబితా తయారీలో పార్టీలు కీలకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం కీలకమైనదని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2వ ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీ వరకు నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పుల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో బీఎల్ఓ, తహసిల్దార్ కార్యాలయాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 16 వేల దరఖాస్తులు స్వీకరించమయని, నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, సవరణల కోసం కల్పించిన అవకాశాల గురించి తెలియజేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీఓ రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమస్యలు పరిష్కరించాలని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. మంగళవారం కలెక్టర్ బొర్కడ హేమంత్‌ను కలిసి వినతి పత్రం అందించారు. నాలుగు రోజులుగా కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్నామని, సమస్యను పరిష్కరించే చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి లోకేష్, దుర్గం లింగయ్య మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడం కాకుండా వెరెస్ట్ ఎల్అండ్‌టీ యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేసి సమ్మె విరమింప చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కార్మికులు ప్రకాష్, ఈశ్వర్, అంబాజిరావు, మధుకర్, మహేష్, రాజేష్, పవన్, సంతోష్, కుమార్ పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

కాగజ్‌నగర్ రూరల్ : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ పిలుపు మేరకు పట్టణంలోని నౌగాం బస్తి, సరిసిల్క్ ఏరియా, ఎల్లా గౌడ్ తోట, భట్టుపల్లి, విలేజ్ నెంబర్12 పీహెచ్‌సీల ఎదుట ఆశా వర్కర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఆశాలు లక్ష్మీ, సువర్ణ, జరీనా, భాగ్య, మాధవి, శకుంతల పాల్గొన్నారు.

గ్రామ సంఘ సహాయకుల కృషి అభినందనీయం

- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్



నవతెలంగాణ-నస్పూర్

పొదుపు సంఘాల ద్వారా మహిళలను సంఘటితం చేస్తూ, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిలో గ్రామ సంఘ సహాయకుల కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ప్రభుత్వం గ్రామ సంఘ సహాయకులకు వేతనాలు పెంచడాన్ని స్వాగతిస్తు మంగళవారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల సమావేశ మందిరంలో కృతజ్ఞత సభను నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి ఆయన సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేకం కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, మహిళలకు అనుసంధానం కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పొదుపు సంఘాల్లోని మహిళలను సంఘటితం చేసి వారిని చైతన్య పరుస్తూ సమన్వయకర్తలుగా బాధ్యతలు గ్రామ సంఘ సహాయకుల సేవలను అందిస్తున్నారు. వారిని గుర్తించి రక్షాబంధన్ కానుకగా వేతనం రూ. 8 వేలకు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ పరిధిలో 4,31,402 మహిళా సంఘాలు పని చేస్తున్నాయని, ఇందులో 4,62,1272 మంది మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు. గతంలో రూ. 6వేలు చెల్లించే వేతనాన్ని 2021లో ప్రభుత్వం 30 శాతం పెంచడంతో రూ.6900 అయిందని, రక్షాబంధన్ కానుకగా రూ.1100 పెంచడంతో 8 వేలు అందించనున్నట్లు పేర్కొఆన్నారు. రాష్ట్రంలో 17608 మంది గ్రామసంఘ సహాయకులకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 468 గ్రామ సంఘ సహాయకుల వేతనం రూ. 8 వేలు పెంచినందున మరింత ఉత్సాహంతో పని చేయాలని తెలిపారు. గ్రామీణ వ్యవస్థలో మహిళలను అన్ని రంగాలలో మరింత ముందుకు తీసుకు వెళ్ళేందుకు, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో గ్రామ సంఘ సహాయకుల పాత్ర ఎనలేనిదని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, పాల్గొన్నారు.

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విధుల నిర్వహణలో సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం నియంత్రణ, పర్యవేక్షణ, క్రమశిక్షణకు లోబడి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషనర్ అధికారి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు తమ విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో రెండు నియోజకవర్గాలు ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్‌లకు డీఎస్పీలు ఇన్‌చార్జీలుగా ఉంటు బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉంటు పోలీస్ స్టేషన్ల పరిధిలోనిపోలింగ్ కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు లేకుండా, సమస్యలు సృష్టించే వారినీ బైండోవర్ చేయాలని సూచించారు. ఇంతకు ముందు ఎన్నికల సమయంలో అలజడి సృష్టించిన వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను విధిగా పర్యటిస్తూ దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జి(రెవెన్యూ శాఖ) మధుకర్, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్ నగర్ డీఎస్పీ కరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేశ్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.



విధి నిర్వహణలో జవాబుదారీగా వ్యవహరించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు తీసుకున్న ఉద్యోగులు విధి నిర్వహణలో జవాబుదారీగా వ్యవహరించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్యతో కలిసి బెల్లంపల్లి నియోజకవర్గంలోని 7 మండలాలకు సంబంధించి 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హత గల జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వీసు క్రమబద్ధీకరణతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గ చిన్నయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు రాష్ట్ర స్థాయిలో అవార్డులను గెలుచుకోవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో పని చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపు, వేదాల శ్రీనివాస్, కొమ్మెర సతీష్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి సాధించాలి

నవతెలంగాణ-నస్పూర్

నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి సాధించాలని డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల ఆధునీకరణ, పనితీరు, వేగవంతమైన బొగ్గు రవాణ, నాణ్యత ప్రమాణాలు తదితర విషయాలపై చర్చించారు. హెచ్ఈఎంఎం యంత్రాలు పనితీరు, మరమ్మత్తులు, స్పేర్ పార్ట్స్ మొదలైన విషయాలు చర్చించి, లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బందులు చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపరితల గనుల్లో ఉపయోగించే భారీ యంత్రాల పనితీరు, వినియోగం గురించి తెలుసుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి కేటాయించిన లక్ష్యాల ప్రకారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, డీజీఎం కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ డీవీ రావు, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి చాలిచాలని వేతనాలతో నర్సరీలో కార్మికులు పని చేస్తున్నారన్నారు. మొక్కలు పెంచడంలో నర్సరీ కార్మికుల పాత్ర అత్యంత కీలకమైన వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతిరోజు కూలీ రూ.600 ఇవ్వాలని, ఆరోగ్య భీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా

ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నర్సరీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్, నర్సరీ కార్మికులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ వెంటనే ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల్ కార్తీక్ అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి ప్రతిరోజు వందలాది మంది ప్రజలు ఇతర ప్రాంతాల నుండి వస్తారని అన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బస్టాండ్ ప్రాంతంలో, జూబ్లీ మార్కెట్ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, గెడాం టికానంద్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.